# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :189 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:బుధవారం 01-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రేమ వ్యవహారంలో దారుణం

జగిత్యాల: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లిలో ప్రేమ వ్యవహారం దారుణానికి దారితీసింది. గ్రామానికి చెందిన డ్రైవర్ ఎదురగట్ల సతీష్ (25)ను, అతని ప్రేమ వ్యవహారం నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు దారుణంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సతీష్, అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కొంతకాలంగా ప్రేమలో ఉన్నాడు. ఈ విషయం తెలిసిన ఆమె బంధువులు పలుమార్లు హెచ్చరించారు. ఆ యువతికి మరో వివాహ సంబంధం చూస్తున్న నేపథ్యంలో, ఈ ప్రేమను కొనసాగించొద్దని సతీష్‌ను వారించారు. అయితే కలత చెందిన సతీష్, ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ యువతి ఫొటో పెట్టి, తాను ప్రేమిస్తున్నానని ప్రకటిస్తూ, ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరాదని సందేశం పోస్ట్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువతి బంధువులు, శనివారం రాత్రి సతీష్ ఇంటి దగ్గరికి వెళ్లి కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాల కారణంగా సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగిత్యాల గ్రామీణ పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు నిందితులు నథారి వినంజీ, శాంత వినంజీ,

## ఢిల్లీలో భారీ వర్షాలు.



దేశ రాజధాని ఢిల్లీ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. జఖీరా అండర్‌పాస్ కింద భారీగా వరదనీరు చేరింది. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో విమానాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. %ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ఇండిగో, ఎయిరిండియా లాంటి పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచనలు చేస్తున్నాయి. వర్షాల కారణంగా విమాన సర్వీసుల షెడ్యూళ్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, కాబట్టి ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు బయలుదేరే ముందే ఫ్లైట్ షెడ్యూల్‌ను చెక్ చేసుకుని రావాలని సలహా ఇస్తున్నారు. వాతవరణ పరిస్థితులను బట్టి కొన్ని ఫ్లైట్ సర్వీసులు రద్దు కూడా కావచ్చుని ప్రయాణికులు ఇది గమనించాలని ఎయిర్‌లైన్స్ హెచ్చరికలు చేస్తున్నాయి.దాంతో షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఢిల్లీ నుంచి ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి రాకపోకలు సాగించాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ట్రంప్ మరో టారిఫ్ బాంబ్.. కలప, ఫర్నిచర్‌పై సుంకాల మోత



టారిఫ్‌ల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. ఫర్నిచర్, కలపపై సుంకాల మోత మోగించారు. కలపపై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు , అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలను ప్రకటించారు. ఈ టారిఫ్‌లు అక్టోబరు 14 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. %మరోవైపు అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా సోమవారం ప్రకటించారు. విదేశాలలోని పోటీదారులు అమెరికన్ సినీ వ్యాపారాన్ని కొల్లగొడుతున్నారని ట్రంప్ తెలిపారు. పసిబిడ్డ నుంచి చాక్లెట్ చోరీ చేసిన విధంగానే ఇతర దేశాలు అమెరికా సినీ నిర్మాణ వ్యాపారాన్ని చోరీ చేస్తున్నాయి అని ట్రంప్ ఆరోపించారు. బలహీన, అసమర్థ గవర్నర్ కారణంగా ప్రత్యేకంగా కాలిఫోర్నియా తీవ్రంగా నష్టపోయింది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎన్నటికీ పరిష్కారం కాని ఈ సుదీర్ఘ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు.

## బీజేపీ సీనియర్ నేత కన్నుమూత



భారతీయ జనతాపార్టీ సీనియర్ లీడర్ , మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్ర కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 94 ఏండ్లు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు బీజేపీ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. %విజయ్ కుమార్ మల్హోత్ర.. ఐదుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఢిల్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఢిల్లీలో పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేశారు. అంతేకాదు రెండుసార్లు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. మల్హోత్ర మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ కోసం మల్హోత్ర చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

## తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మార్చిన ప్రభుత్వం




హైదరాబాద్ : నగరంలోని ప్రముఖ ఫ్లైఓవర్ అయిన 'తెలుగుతల్లి ఫ్లైఓవర్' పేరును 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఫ్లైఓవర్‌పై తెలంగాణ తల్లి అని వచ్చేలా నూతన సుచిక బోర్డులను పెట్టారు. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి సచివాలయం వరకు విస్తరించి ఉన్న ఈ ఫ్లైఓవర్‌కు ఇకపై 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్' అని పేరు మార్చగా.. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని గుర్తింపును ప్రతిబింబించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించి 'తెలుగుతల్లి ఫ్లైఓవర్'గా నామకరణం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ పేరు మార్చాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది.

## గాజాపై ట్రంప్ ఫార్ములాను స్వాగతించిన భారత్



ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. గాజాలో యుద్ధం ముగింపుకు ట్రంప్ సూచించిన 20 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ట్రంప్ ప్లాన్‌ను పలు దేశాలు స్వాగతిస్తున్నాయి. తాజాగా గాజాపై ట్రంప్ ప్రణాళికను భారత్ కూడా స్వాగతించింది. %గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికను స్వాగతిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ట్రంప్ ప్రణాళిక పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. యుద్ధం ముగించి శాంతిని నెలకొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్టు వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజాలో యుద్ధం ముగింపుకు ట్రంప్ 20 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించారు. ట్రంప్ ప్లాన్‌కు ఇజ్రాయెల్ అంగీకారం తెలిపింది. సోమవారం వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు ట్రంప్‌తో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. గాజాలో యుద్ధాన్ని ముగించడమే కాకుండా.. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఏర్పాట్లు జరగాలని కోరుకుంటున్నట్లు నెతన్యాహు ఈ సందర్భంగా తెలిపారు.

## సుల్తానాబాద్‌లో రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి




సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుద్దాల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం సుద్దాల వద్ద రైండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. మృతులను సుల్తానాబాద్‌కు చెందిన అభి, రాకేశ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్పంచ్ అభ్యర్థులు తొందరపడి డబ్బులు ఖర్చు పెట్టకండి



హైదరాబాద్: స్థానిక ఎన్నికలపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు ఇప్పుడే జరుగకపోవచ్చని, సర్పంచ్ అభ్యర్థులు డబ్బులు ఖర్చు పెట్టొద్దని సూచించారు. తొందరపడి దసరాకు దావత్‌లు ఇవ్వొద్దన్నారు. చట్టబద్ధంగా చెల్లుబాటు కాని ఎన్నికలతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఇది రాజ్యాంగబద్ధంగా లేదని కోర్టు కొట్టేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మహారాష్ట్ర తరహాలో ఎన్నికలు చెల్లుబాటు కాకపోతే పరిస్థితి ఏంటన్నారు. %బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో రేవంత్ సర్కార్ డ్రామాలు ఆడుతున్నదని విమర్శించారు. మహారాష్ట్రలో స్థానిక ఎన్నికలు జరిగిన తర్వాత హైకోర్టు ఎన్నికలు రద్దు చేసిందని.. ఎన్నికల్లో ఖర్చుపెట్టిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు.

## ఫ్లైట్ ఆలస్యం.. ఎయిర్‌పోర్టులో గర్బా ఆడిన ప్రయాణికులు




సాధారణంగా విమానం ఆలస్యమైతే ప్రయాణికులు చిరాకు పడటం, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేయడం చూస్తుంటాం. కానీ గోవా ఎయిర్‌పోర్ట్‌లో అందుకు భిన్నంగా.. ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించింది. గోవా నుంచి వెళ్లాల్సిన విమానం ఆలస్యం కావడంతో అక్కడ ఉన్న ప్రయాణికులు తమ నిరీక్షణ సమయాన్ని పండుగలా మార్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల గోవా నుంచి సూరత్‌కు వెళ్లాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఆలస్యమైంది. పైలట్ అనారోగ్యం కారణంగా ఈ జాప్యం జరిగినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. దీంతో గోవా నుంచి సూరత్‌కు వెళ్లి గర్బా ఉత్సవాల్లో పాల్గొనాలని భావించిన మయూర్ అనే వ్యక్తి ఫ్లైట్ ఆలస్యం కావడంతో అతడి నిరాశను ఎయిర్‌పోర్ట్ సిబ్బందితో పంచుకున్నాడు. అయితే మయూర్ నిరాశను గమనించిన ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది అద్భుతమైన ఆలోచన చేసింది. అతడి నిరాశను మర్చిపోవడానికి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లోనే మ్యూజిక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి గర్బా పాటలను ప్లే చేసింది. దీంతో మయూర్‌తో పాటు అక్కడ ఉన్న ప్రయాణికులంతా ఒక్కసారిగా ఉత్సాహంలో మునిగిపోయి, సామూహికంగా గర్బా నృత్యం చేయడం మొదలుపెట్టారు. ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ సిబ్బంది కూడా డ్యాన్స్‌లో పాల్గొని పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. విమానం ఆలస్యం కావడంతో ఏర్పడిన నిరుత్సాహాన్ని మర్చిపోయేలా ఈ గర్బా నృత్యం ప్రయాణికులకు మరపురాని అనుభూతిని ఇచ్చింది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## నేపాల్‌లోలాగా ఇక్కడ కూడా యువత తిరగబడాలి.. ?




తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లా లో టీవీకే చీఫ్ విజయ్ ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట అంశం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ తొక్కిసలాట వెనుక కుట్ర కోణం ఉందని టీవీకే ఆరోపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ఓ నేత పెట్టిన పోస్టు ప్రస్తుతం వివాదాస్పదమైంది. తమపై కుట్రలకు పాల్పడుతున్న దుష్ట ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే నేపాల్ మాదిరిగా ఇక్కడ యువత తిరగబడాలంటూ టీవీకే జనరల్ సెక్రటరీ ఆధవ అర్జున్ (%ఖుఖుంష్టుుజ ఞాతీయబఋఖు%) పోస్టు పెట్టారు. 'యువత నేతృత్వంలోని ఉద్యమమే ఏకైక పరిష్కారం. జనరేషన్ జెడ్ యువత శ్రీలంక, నేపాల్‌లో పాలక ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. ఇక్కడ కూడా యువత ఉద్యమానికి నాయకత్వం వహిస్తారు. ఆ ఉద్యమమే ప్రభుత్వం మార్పునకు కారణం అవుతుంది. దుష్టపాలకుల పాలనలో చట్టాలు కూడా దుర్మార్గంగా మారతాయి' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ఈ పోస్టు వైరల్ కావడంతో తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆ పోస్టును అర్జున్ తొలగించారు. అయితే, అప్పటికే స్క్రీన్‌షాట్ రూపంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## బెట్టింగ్ యాప్ కేసు.. ఈడీ విచారణకు హాజరైన ఊర్వశి రౌతేలా



బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో విచారణకు రావాలని ఈడీ ఊర్వశి రౌతేలాకి ఈనెల 15న సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకుంది ఉర్వశి. ఈ విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వాటితో ఉర్వశికి ఉన్న సంబంధాలు ప్రచారానికి తీసుకున్న డబ్బుల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈడీ విచారించింది. ఇటీవల సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, నటి మంచు లక్ష్మి, నటుడు విజయ్ దేవరకొండ, రానా, ప్రకాశ్ రాజ్, సోను సూద్ కూడా విచారణకు హాజరయ్యారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, నల్లధనం లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే పలువురు సెలబ్రిటీలను ఈడీ ప్రశ్నిస్తోంది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



హైదరాబాద్ : రచయిత, ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. అంబేద్కర్ విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. సాహిత్య విభాగంలో గోరటి వెంకన్న చేస్తున్న సేవను గుర్తించి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది.

## పారిశుధ్యం అస్తవ్యస్తం, వెలగని విద్యుత్ దీపాలు



రాయపోల్, సెప్టెంబర్ 30 : అసలే వర్షాలు కురుస్తున్న కాలం మురికి కాలువలు అపరిశుభ్రంగా ఉండడంతోపాటు వీధులన్నీ వర్షపు నీటితో నిండి ఇళ్ల మధ్యనే పెంట కుప్పలు ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. రాయపోల్ మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇండ్ల మధ్యనే పెంటకుప్పలు ఉన్నాయని.. మురికి కాలువలు తీయడం లేదని, మంచినీటి పైపులు మురికి కాలువలో ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

## సంపాదకీయం

**బుధవారం 01-10-2025**

# విద్యార్థులకు నేస్తం... ఏఐ

వరసగా బల్లల మీద కూర్చున్న విద్యార్థులు, ఎదురుగా చేతిలో పుస్తకంతో ఓ ఉపాధ్యాయుడు, వెనకాల నల్లబల్ల... సంప్రదాయ తరగతి గది దృశ్యం ఇది. ప్రపంచవ్యాప్తంగా విద్యాలయాల్లోకీ ప్రవేశించిన కృత్రిమ మేధ ఈ దృశ్యాన్ని మార్చేయనుందా? నిజానికి అందరూ భయపడుతున్నట్లుగా ఏఐతో గురువు పాత్రకు ఎలాంటి ఢోకా లేదు. పైగా అది తరగతి గది సరిహద్దుల్ని చెరిపేయనుంది. పాఠశాలల్లో అందని ద్రాక్షగా మారిన 'విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ'ని ఏఐ సుసాధ్యం చేయబోతోంది!బోధనలో కృత్రిమ మేధ వినియోగం అన్న విషయం చర్చకు రాగానే చాలామంది టీచరు పాత్రను ఏఐ భర్తీ చేస్తుందేమోనన్న అపోహకు లోనవుతున్నారు. బోధన అనేది కేవలం జ్ఞానాన్ని పంచడం కాదు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్రకి ఇంకా చాలా ప్రాధాన్యం ఉంది. మార్గదర్శకత్వం వహించడం, ఉద్వేగపరమైన మద్దతునివ్వడం, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడటం, నైతిక విలువలు నేర్పడం ఇలాంటివన్నీ మనిషికి తప్ప ఏఐ అల్గారిథమ్‌లకు సాధ్యం కావు. విద్యార్థి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోగలిగేది, తడబడుతున్న పిల్లాడికి ధైర్యాన్నిచ్చి వెన్నుతట్టగలిగేది టీచరు మాత్రమే. యాంత్రికంగా బట్టీ పట్టడం కాకుండా, కొత్త విషయాలు నేర్చుకునే దిశగా చేసే అర్థవంతమైన ప్రయాణంగా చదువును మలచేది గురువులే. ఈ ప్రయత్నంలో వారికి ఏఐ ఒక మంచి భాగస్వామిగా కాగలదు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజననీ, విమర్శనాత్మక ఆలోచననీ ప్రోత్సహించి వ్యక్తిత్వాన్ని నిర్మిస్తారు. ఆయా విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను బట్టి వారికి అవసరమైన అదనపు బోధనను అందించగలుగుతుంది ఏఐ. ఉదాహరణకు ఒక విద్యార్థి గణితంలో ఒక కాన్సెప్ట్ అర్థంకాక ఇబ్బంది పడుతుంటే ఏఐ ట్యూటర్ దాన్ని వివరించి చెప్పేందుకు ప్రయత్నిస్తుంది. దృశ్యరూపంలో, అంచెలంచెల విధానంలో, నిజజీవితానికి అన్వయించి, ప్రశ్న జవాబుల రూపంలో... ఇలా పిల్లలకు అర్థమయ్యేందుకుగాను భిన్న బోధనా విధానాలను అది అనుసరిస్తుంది. ఈ విధమైన భాగస్వామ్యం ఉపాధ్యాయులు తమ బోధనను కేవలం సమాచార పంపిణీకి పరిమితం చేయకుండా మరొకడుగు ముందుకేసేందుకు తోడ్పడుతుంది. విద్యార్థుల్లో జిజ్ఞాసను, మేధో సామర్థ్యాలను పెంచే విషయాలపై దృష్టి పెట్టవచ్చు.

సామర్థ్యాలకు ఊతం

కృత్రిమమేధ నేడు సర్వవ్యాపి. హెల్త్‌కేర్ డయాగ్నోస్టిక్స్ నుంచి బిజినెస్ ఎనలిటిక్స్ వరకూ అది లేని రంగం లేదు. దాంతో నేటి విద్యార్థులు చదువు ముగించుకున్నాక ఉపాధి నిమిత్తం ఏ రంగంలో ప్రవేశించినా ఏఐతోనే పనిచేయాల్సి వస్తుంది. కాబట్టి పాఠశాల స్థాయిలోనే విద్యాసంస్థలు కృత్రిమ మేధను విద్యార్థులకు పరిచయం చేసి, దాన్ని బాధ్యతగా ఉపయోగించడాన్ని నేర్పాలి. నేర్చుకోవడాన్ని సులభతరం చేసే దగ్గరిదారిగా కాకుండా విషయాలను లోతుగా అధ్యయనం చేసే మార్గంగా వారికి ఏఐ గురించి తెలియజేయాలి. ఏఐ మనిషి స్థానాన్ని భర్తీ చేయదు కానీ, మనిషి సామర్థ్యాలను పెంచగలదని చెప్పాలి. విద్యార్థుల సంఖ్య కారణంగా సంప్రదాయ తరగతి గదుల్లో అందరినీ ఒకే మూసలోకి చేర్చక తప్పడం లేదు. కానీ అభ్యసన సామర్థ్యాలు పిల్లలందరికీ ఒకే స్థాయిలో ఉండవు. దాంతో కొందరు వెనకబడిపోవడం సహజం. ఆ లోటును ఏఐ ట్యూటర్‌తో భర్తీ చేయవచ్చు. కొందరికి దృశ్యం, కొందరికి రంగులు, కొందరికి పాటలు... ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో పద్ధతిలో చెబితే త్వరగా అర్థమవుతుంది. పిల్లలను చిన్నబుచ్చకుండా ఏఐ ఎన్నిసార్లయినా ఆయా విధానాల్లో బోధిస్తుంది. టీచర్ల మాదిరి సమయాభావం సమస్య దానికి ఉండదు. అంతేకాదు, ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిని సమీక్షిస్తుంది. నేర్చుకోవడంలో పిల్లలకు సమస్యలుగా మారకముందే అవరోధాలను కనిపెట్టి పరిష్కరిస్తుంది. అదే సమయంలో వేగంగా నేర్చుకునే వాళ్లకు తగినట్లుగా మరింత అడ్వాన్స్‌డ్ కోర్సు మెటీరియల్‌ని అందజేస్తుంది. ముప్ఫై యికిపైన విద్యార్థులు ఉండే తరగతి గదిలో ఈ స్థాయిలో పిల్లల వేగానికి తగినట్లుగా వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పాఠ్యాంశాల ప్రణాళిక రూపొందించడం ఉపాధ్యాయులకు దాదాపు అసాధ్యం.

సమ్మిళిత కృషి అవసరం

విద్యాబోధనలో కృత్రిమమేధ సహకారం తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. పాఠాలను రివిజన్ చేసేటప్పుడు పెద్ద పెద్ద పాఠాలను కుదించి సారాంశాన్ని అందిస్తుంది ఏఐ. క్లిష్టమైన అంశాలమీద భిన్న కోణాల్లో విశ్లేషణలు చేస్తుంది. విద్యార్థులు సాధన చేయడానికి అపరిమితమైన ఎక్సర్‌సైజులు తయారు చేసి ఇస్తుంది. పిల్లల ప్రగతిని అంచనా వేస్తుంది. అయితే టీచరు లాగా విద్యార్థి మానసిక స్థితిని దృష్టిలో పెట్టుకుని సందర్భోచితంగా నిర్ణయాలు తీసుకోవడం, పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఏఐకి తెలియదు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు మంచి సహాయ వ్యవస్థగా పనిచేస్తుంది. అభివృద్ధి చెందిన ఏఐ వ్యవస్థలు విద్యార్థికి సంబంధించిన ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుని వెనకబడే అవకాశం ఉన్న పిల్లలను గుర్తించగలవు. అభ్యసనంలో అంతరాలు లేకుండా చూడగలవు. అలాగే టీచర్లకు బోధనకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పడతాయి. ఏయే అంశాలమీద ఎక్కువ శ్రద్ధ చూపాలి, ఏ తరహా బోధన విధానం ఎక్కువ ప్రభావం చూపుతోంది...లాంటి విషయాలు తెలుస్తాయి. టీచర్లు పాలనాపరమైన పనులమీద దృష్టి పెట్టడం తగ్గించి విద్యార్థులతో అనుబంధాలు పెంచుకోవడం, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడం, నిరంతరం నేర్చుకుంటూ ఉండే విధంగా స్ఫూర్తినివ్వడం... లాంటివి చేయవచ్చు.ఏఐ ఆధారిత విద్యా సాధనాలు ఎన్నో అందుబాటులోకి వస్తున్నాయి. మనదేశంలోనూ కేంద్రీయ విద్యాలయాలు పలు పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పన కోణం నుంచి చూస్తే నగరాల్లోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏఐ అందుబాటులో ఉన్నట్లు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అందుబాటులో ఉండే అవకాశం లేదు. కృత్రిమమేధ పాఠశాలలకు అందుబాటులోకి రావాలంటే అందుకు తగిన సాంకేతికత అవసరం. అలాగే ఉపాధ్యాయులకు కూడా ఏఐ టూల్స్‌ని సమర్థంగా వినియోగించడంలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. టీచరు కేంద్రంగా కృత్రిమమేధను విద్యావిధానంలో భాగం చేయడం వల్ల ఈ రంగంలో దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను పరిష్కరించడం సులువవుతుంది. ఉపాధ్యాయులు, కృత్రిమ మేధ వ్యవస్థల సమ్మిళిత కృషి భావితరాన్ని మేటిగా తీర్చిదిద్దుతుందనడంలో సందేహం లేదు.

# అసెంబ్లీకి గైర్హాజరు.. వైసీపీకి భారీ ప్రయోజనం!



అమరావతి,అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక. తమ సమస్యల్ని చట్టసభల్లో ప్రస్తావించి, వాటిని పరిష్కరిస్తారనే నమ్మకంతోనే ప్రజలు పట్టం కడుతుంటారు. అయితే గెలిస్తే తప్ప, అసెంబ్లీకి వెళ్లేది లేదనే ధోరణి నాయకుల్లో కనిపించడం విషాదం. ఇప్పుడు వైఎస్ జగనే కాదు, గతంలో అనేక మంది ప్రముఖులు వివిధ కారణాలతో అసెంబ్లీ గడప తొక్కేది లేదని ప్రతినబూనడం గురించి కథలుకథలుగా విన్నాం.ఇప్పుడు ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న కారణంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లడం లేదు. జగన్‌ను ఆయన పార్టీకి చెందిన మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు అనుసరిస్తుండడాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కాలం అనుకూలిస్తే తప్పులు కూడా ఒక్కోసారి కలిసి వస్తుంటాయి. ఏపీ అసెంబ్లీ సమావేశాలు వైసీపీకి రాజకీయంగా కలిసి రావడమే నిదర్శనం. ఏపీ అసెంబ్లీ సమావేశాలు 8 రోజుల పాటు జరిగాయి. వీటితో పాటు మండలి సమావేశాలు కూడా అంతేస్థాయిలో నిర్వహించారు.ఏపీ శాసనమండలి సమావేశాలకు వైసీపీ హాజరైంది. అందుకే మండలిలో కూటమి ప్రభుత్వం, వైసీపీ మధ్య పోరు హోరాహోరీని తలపించింది. మండలిలో వైసీపీ పక్ష నాయకుడు , మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో కూటమి నేతలకు ముచ్చెమటలు పట్టించారు. రాష్ట్రంలోని ప్రతి ప్రజా సమస్యపై వైసీపీ సభ్యులు గట్టిగా నిలదీశారు. ఈ సందర్భంగా కూటమి, వైసీపీ సభ్యుల మధ్య డైలాగ్ వార్ చోటు చేసుకుంది.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఉద్దేశించి కుప్పం ఎమ్మెల్యే అంటూ వైసీపీ సభ్యుడు రమేశ్‌యాదవ్ అన్నది కూడా మండలిలోనే. వైఎస్ జగన్‌ను పులివెందుల ఎమ్మెల్యే అంటూ కించపరిచే కూటమి ప్రజాప్రతినిధులకు మండలి వేదికగా వైసీపీ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. ఇంకా వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, రైతులకు యూరియా, పంటలకు గిట్టుబాటు ధరల్లేకపోవడంపై కూటమి సర్కార్‌ను వైసీపీ గట్టిగా నిలదీసింది. అందుకే కూటమి సభ్యుల తీరుపై మండలికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదుల్లేవు.కానీ శానససభలో ప్రతిపక్షం లేకపోవడంతో ఆ పాత్రను కూటమి ప్రజాప్రతినిధులే కొద్దోగొప్పో పోషించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఇరకాటంలో పడే పరిస్థితి. మరీ ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విషయంలో ప్రశ్నించిన తీరు. విధుల నిర్వహణలో అందుబాటులో వుండడం లేదని సాక్ష్యాత్తు జనసేనానినే నిందించడం తీవ్ర చర్చనీయాంశమైంది.అలాగే కామినేని, బాలయ్య మధ్య సంవాదం%ొ% మెగాస్టార్ చిరంజీవి లేఖ విడుదల , ఇవన్నీ కూడా అసెంబ్లీ సమావేశాల్లో కూటమి నేతల నిర్వాకమే కారణం. కూటమి ప్రభుత్వానికి, గతంలో వైసీపీ ప్రభుత్వ విధానాలకు తేడా ఏమీ లేదని సుజనా చౌదరి లాంటి సీనియర్ నాయకుడు అసెంబ్లీ వేదికగా ఘాటు వ్యాఖ్య చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా అమరావతి రైతులకు ప్రయోజనం లేదని ఆయన అసెంబ్లీ వేదికగా నిరసించారు.అలాగే ప్రజా సమస్యలపై పలువురు కూటమి ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ధైర్యంగా ప్రస్తావించారు. తద్వారా కూటమి ప్రభుత్వ పనితీరును అందులో భాగస్వాములైన ప్రజాప్రతినిధులే ప్రస్తావిస్తూ, విమర్శించడం వల్ల రాజకీయంగా నష్టం జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అందుకే సీఎం చంద్రబాబుకు కోపం వచ్చింది. అసెంబ్లీలో సభ్యుల తీరుపై ఆయన ఆగ్రహంగా ఉన్నారంటూ కథనాలు వెలువడ్డాయి. ఒకవేళ వైసీపీ సభ్యులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై వుంటే, రాజకీయంగా ఆ పార్టీకి మైలేజీ వచ్చి వుండేది కాదేమో!కూటమి ప్రజాప్రతినిధులంతా పూర్తిస్థాయిలో వైఎస్ జగన్, ఆయన పార్టీ ప్రజాప్రతినిధుల్ని తిట్టడానికే సమయాన్ని వెచ్చించేవారు. అయితే అసెంబ్లీలో అంతా కూటమి ప్రజాప్రతినిధులే ఉండడం, వ్యక్తిగత ఎజెండాలతో మాట్లాడ్డం వల్ల సమావేశాలు కాస్త రాజకీయంగా నష్టం తీసుకొచ్చాయంటున్నారు. అందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోయినా, వైసీపీ నేతల్లో జోష్ కనిపిస్తోంది.

# 'వెండితెర'పై బాబు తొండి రాజకీయం!

అమరావతి,ప్రభుత్వం చేసే తప్పుడు నిర్ణయాలవల్ల ప్రజలకు కలిగే నష్టం విషయంలో సమాజంలో వ్యతిరేకత పెరుగుతున్నదంటే ఆ అంశంనుంచి ప్రజల దృష్టి మరల్చడానికి ఏదో ఒక వివాదాన్ని సృష్టించడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మించినవాళ్లు ఈ దేశరాజకీయాల్లో ఇంకొకరు ఉండరు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఒక అంశం మీద ప్రజలలో తీవ్ర వ్యతిరేకత పెరగడం చూస్తున్నాం. అది వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు నిర్ణయించి, నిర్మాణం ప్రారంభించి, ఐదు కళాశాలల నిర్మాణం పూర్తయి విద్యార్థులు చేరి వైద్య విద్య కొనసాగుతున్న పరిస్థితుల్లో ఆ మొత్తం వైద్య కళాశాలలను ప్రైవేటు పబ్లిక్ పార్టనర్ షిప్ (పిపిపి) పేరుతో ప్రైవేటీకరించే నిర్ణయం చంద్రబాబు ప్రభుత్వం తీసుకోవడం.దానిమీద ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దయెత్తున ఆందోళనకు దిగడం, ప్రజల్లో కూడా తీవ్ర వ్యతిరేకత కనబడటంతో ఆ సమస్యనుంచి అందరి దృష్టిని మళ్లించేందుకు ఆయన బిజెపి సభ్యుడు కామినేని శ్రీనివాస్‌ను, తన సొంత బావమరిది, టిడిపి సభ్యుడు, నటుడు బాలకృష్ణను రంగ ప్రవేశం చేయించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 8,884 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ రంగంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయానికి కేంద్రంనుండి సాంకేతిక అనుమతులు కూడా వచ్చాయి. కళాశాలలన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఈ సమయంలో పిపిపి పేరుతో చంద్రబాబు నాయుడు ఎకరానికి 100 రూపాయల లీజు పద్ధతిన 66 ఏళ్లపాటు కళాశాలలన్నిటినీ ప్రైవేటువారికి ధారాదత్తం చేయడానికి నిర్ణయించారు.ఒక్కసారి గతం గుర్తు చేసుకుంటే 1992 ప్రాంతాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ప్రభుత్వం ప్రైవేటు రంగంలో వైద్య కళాశాలలకు అనుమతిస్తున్నదన్న అంశం మీద అప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన చంద్రబాబు, ఇప్పుడు ఏకంగా 17 వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు పూనుకున్నారు. 'అప్పటికీ ఇప్పటికీ నా ఆలోచనలు మారాయి. నేను చాలా ముందుకు పోయాను' అని ఆయన అనొచ్చు కానీ ఏ కాలంలో అయినా, ఎవరి ఆలోచనలో ఎన్ని మార్పులు వచ్చినా విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ అజమాయిషీలో ఉండటమే సరైన విధానం. నిజానికి 1992 వ్యవహారంలో కోర్టు తప్పుబట్టడంతో జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు అదే చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి అయి వైద్య రంగాన్ని ప్రైవేటు వ్యక్తులు,సంస్థల చేతుల్లో పెట్టేందుకు తహతహలాడిపోతున్నారు. ఈ అంశంమీద ఆంధ్రప్రదేశ్‌లో పెద్దయెత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. సహజంగానే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీన్ని అందిపుచ్చుకొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జనాన్ని సమీకరించే పనిలో పడింది. సరిగ్గా ఇదే సమయంలో శాసనసభ సమావేశాలలో కామినేని శ్రీనివాస్ అనే బిజెపి సభ్యుడు సభలో ఒక అసందర్భ ప్రస్తావన తీసుకొచ్చి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా సినిమావారిని, అందునా ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవిని అవమానించాడని మాట్లాడారు. అప్పుడు సభలోనే ఉన్న టిడిపి సభ్యుడు బాలకృష్ణ కామినేని శ్రీనివాస్ మాటలను ఖండిస్తూ చిరంజీవిని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఇద్దరినీ అవమానించే విధంగా మాట్లాడారు.జగన్మోహన్ రెడ్డిని శాసనసభ లోపల, వెలుపల అధికారంలో ఉన్ననాడు, ప్రతిపక్షంలో ఉన్ననాడు కూడా అనరాని మాటలు, అసభ్యకరమైన దూషణలు అనేకం చేసిన పార్టీ ప్రతినిధిగా బాలకృష్ణ అలాంటి పరుషపదాలు వాడటంలో ఆశ్చర్యం లేదు. గత ఎన్నికల ప్రచార సమయంలో బాలకృష్ణ బావగారు చంద్రబాబు, తన అల్లుడు లోకేష్, తన తమ్ముడిగా దత్తత తీసుకున్న పవన్ కళ్యాణ్ ప్రచారసభల్లో జగన్మోహన్ రెడ్డికి, ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా అవమానకరంగా మాట్లాడిన మాటలు, ఉపయోగించిన భాష తెలియనిదేమీ కాదు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఒక కుంభకోణంలో నిందితుడిగా చంద్రబాబు నాయుడును పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో పాదయాత్రలో ఉన్న లోకేష్ అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి గురించి చేసిన వ్యాఖ్యానాలు గాని, అంతకుముందు తెలుగుదేశం పార్టీ ఛోటా నాయకుడు ఒకరు జగన్మోహన్ రెడ్డి తల్లిని దూషించిన వ్యవహారంకంటే శాసనసభలో బాలకృష్ణ మాట్లాడింది ఎక్కువేం కాదు.బాలకృష్ణ, కామినేని శ్రీనివాస్ ఇద్దరి మాటల మీదా అమెరికాలో ఉన్న చిరంజీవి వెంటనే స్పందించి జగన్మోహన్ రెడ్డి తమను చాలా గౌరవించారని, అమర్యాద ఏమీ జరగలేదని ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల ప్రచార సభల్లో ఆయన తమ్ముడు పవన్ కళ్యాణ్ కొన్ని వందలసార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన అన్న చేత దండం పెట్టించుకున్నారని, అగౌరవపరిచారని ప్రచారం చేసుకున్నా నోరు మెదపని చిరంజీవి ఇప్పటికైనా వాస్తవం మాట్లాడినందుకు సంతోషించాల్సిందే. కానీ



అప్పుడే ఎందుకు ఈ విషయం ఆయన చెప్పలేదు అన్నది మాత్రం శేష పశ్నగానే మిగిలిపోతుంది. బహుశా సినిమా రంగంలో బాలకృష్ణకు, ఆయనకు ఉన్న బద్ధవైరం కారణంగా ఇప్పుడు ఇలా స్పందించి ఉంటారేమో. ఇంకెక్కడా లేని విధంగా తెలుగు సినిమా పరిశ్రమను కులజాడ్యం పట్టిపీడిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఓ రెండు కులాల వాళ్ళు సినిమా రంగం మీద ఆధిపత్యంకోసం తెగ ఆరాటపడిపోతుంటారు. రాజకీయాల దగ్గరికి వచ్చేసరికి ఆంధ్రప్రదేశ్ లో జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోవడానికి ఆ రెండు కులాలు, ఓ మూడు పార్టీలు ఒక్కటి కావలసిన పరిస్థితి. అయినా అప్పుడప్పుడు ఇలా బాలకృష్ణ రూపంలో రాజకీయ వేదికల మీద కూడా ఈ రెండు కులాల కుమ్ములాట బహిర్గతం అవుతూ ఉంటుంది.చిరంజీవి దంపతులను తన ఇంటికి ఆహ్వానించి బయటనుండి సాదరంగా లోనికి తోడ్కొని పోయి విందు ఇచ్చి జగన్మోహన్ రెడ్డి దంపతులు సత్కరించిన ఉదంతాన్ని వక్రీకరించి అవమానించారని ఆనాడు గుండెలు బాదుకున్న పవన్ కళ్యాణ్, ఇవాళ శాసనసభ సాక్షిగా చిరంజీవిపట్ల అవమానకర వ్యాఖ్యలుచేసిన బాలకృష్ణ వ్యవహారంలో మాత్రం నోరు మెదపలేదు. అందుకు కారణం ఆయన జ్వరపీడితుడై ఉండడమని పవన్ కళ్యాణ్ కు సంబంధించినవాళ్ళు సమర్థించుకుంటున్నారు. జ్వరం వచ్చినంత మాత్రాన ఒక లిఖితపూర్వక ప్రకటన కూడా విడుదల చేయలేనంత అనారోగ్యంతో ఆయన ఉంటారని అనుకోవడానికి వీల్లేదు. బహుశా అప్పుడు ఎలా అయితే చంద్రబాబు నాయుడును మెప్పించడం కోసం జగన్మోహన్ రెడ్డి తన అన్నను అవమానించారని గుండెలు బాదుకున్నాడో ఇప్పుడు అదే చంద్రబాబు నాయుడును మెప్పించడంకోసం తన అన్నను బాలకృష్ణ అవమానిస్తుంటే మౌనముద్ర వహించారని అనుకోవాలి.ఇక అసెంబ్లీలో బాలకృష్ణ జగన్మోహన్ రెడ్డిని అవమానిస్తూ చేసిన వ్యాఖ్య మీద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్దయెత్తున విరుచుకుపడ్డాయి. ఈ విషయంలో రకరకాల వ్యాఖ్యానాలు వచ్చాయి. అందులో ప్రధానమైన వాటి గురించి చెప్పుకోవాలి. ఒకటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రస్తావన. దాని గురించి చెప్పుకోవాలంటే ఓ 20 సంవత్సరాల క్రితం బాలకృష్ణ నివాసంలో జరిగిన రెండు సంఘటనల గురించి మాట్లాడుకోవాలి. ఆ రెండు సంఘటనల్లోనూ ఆయన ఇంట్లో తుపాకులు మోగాయి. మొదటి తుపాకీ కాల్పుల సంఘటనలో ఒక సినీ నిర్మాత, ఒక జ్యోతిష్కుడు తీవ్రంగా గాయపడ్డారు. రెండో సంఘటనలో ఒక వాచ్‌మెన్ మరణించాడు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి. బాలకృష్ణ ఇంట్లో జరిగిన ఈ సంఘటనల విషయంలో కేసులేమయ్యాయో ఎవరికీ తెలియదు. ఆయన మానసిక స్థితి సరిగా ఉండదన్న డాక్టర్ సర్టిఫికెట్ తో బాలకృష్ణ మీద ఎటువంటి చర్య లేకుండా పోయింది.ఇతరుల మీద కాల్పులు జరిపి ప్రాణహానికి కారకుడయ్యేంత ప్రమాదకర స్థితిలో ఉన్న వ్యక్తి తుపాకీ లైసెన్సు వెంటనే రద్దు చేసి ఎర్రగడ్డలోని మానసిక రోగుల చికిత్స కేంద్రంలోనో, విశాఖపట్నంలోని మానసిక చికిత్స కేంద్రంలోనో చేర్పించి చికిత్స జరిపించాల్సింది పోయి ఆయనను జనంలోకి ఎలా వదులుతారు? ఆయన ఈ 20 ఏళ్లుగా ఎన్నో సినిమా షూటింగుల్లో పాల్గొంటున్నాడు. మూడుసార్లు ఎన్నికల్లో పోటీచేసి శాసనసభ్యుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. మరి అటువంటి స్థితిలో ఉన్న మనిషి జనంలో తిరిగేందుకు అవకాశం కల్పించిన దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గొప్ప మనసుతో చేసిన నిర్ణయమే అయినా తప్పుపట్టాల్సిందే. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందినవాళ్లు రాజశేఖర్ రెడ్డిగారి మంచితనంవల్లనే నువ్వు కేసులోనుంచి బయటపడగలిగావని ఇప్పుడు బాలకృష్ణను విమర్శించడంలో అర్థం లేదు.రాజశేఖర్ రెడ్డిగారు ఒక సందర్భంలో శాసనసభలోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును ఉద్దేశించి 'బాలకృష్ణ ఇంట్లో జరిగిన సంఘటననైనా మేము రాజకీయంగా వాడుకున్నామా చంద్రబాబు' అని వ్యాఖ్యానించారు. నిజమే, మానసిక స్థితి బాగాలేక కాల్పులు జరిపి ఇద్దరిని గాయపరిచిన ప్రతిపక్ష నాయకుడి బావమరిది అంశాన్ని రాజకీయం చేయకపోవడం రాజశేఖర్ రెడ్డి పెద్ద మనసుకు

# ర్యాలీలతో ప్రాణాలు తీసేస్తున్న నేతలు

చెన్నై,కరూర్ తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రుల్లో ఇంకా పదుల కొద్దీ చావుతో కొట్టుమిట్టాడుతున్నారు. మృతుల సంఖ్య భారీగా పెరిగేలా కనిపిస్తోంది. దేశ చరిత్రలో ఓ రాజకీయ పార్టీ ర్యాలీకి వెళ్లి ఇంత మంది చనిపోవడం ఇదే మొదటిసారి కావచ్చు. ఈ నడుమ చాలా తొక్కిసలాటలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న ఆర్సీబీ పరేడ్ లో తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. అంతకు ముందు పుష్ప-2 ప్రీమియర్స్ కు వెళ్లి రేవతి అనే మహిళ చనిపోయారు. ఆమె కొడుకు ఇంకా బెడ్ మీద నుంచి లేవట్లేదు. జగన్ ర్యాలీలో సైతం ఓ వ్యక్తికారుకింద పడి చనిపోయారు. ఇక సినిమా ఈవెంట్లకు వెళ్లి ఎవరో ఒకరు చనిపోతున్న ఘటనలు లెక్కే లేదు. తొక్కిసలాట ఎక్కడ జరిగినా సరే.. అక్కడ చనిపోయేది మాత్రం సామాన్యులే. సినిమా ఈవెంట్ అయినా.. క్రికెట్ పరేట్ అయినా.. రాజకీయ సభ అయినా సరే.. చనిపోయేది మాత్రం సాధారణ అభిమానులే. హీరోలు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు అందరూ బాగానే ఉంటారు. చనిపోయేది వాళ్ల కోసం వెళ్లిన సాధారణ ప్రేక్షకులే. ఒక ఈవెంట్ నిర్వహిస్తున్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంత మంది వస్తారు.. అసలు అక్కడ అంత పెద్ద సభ ఏర్పాటు- చేయొచ్చా లేదా.. పోలీసుల సలహాలు ఏంటి అనేవి పాటించాలి కదా. కానీ ఎవరూ పాటించరు. తమ బల ప్రదర్శన చూపించుకోవాలి.. దాన్ని మీడియాలో, సోషల్ మీడియాలో హైలెట్ చేసుకోవాలనే తాపత్రయమే తప్ప.. అభిమానులకు ఇబ్బంది అవుతుందనే విషయం కూడా ఆలోచించట్లేదు. ఆర్సీబీ పరేడ్ కు ఎంత మంది వస్తారనే సమాచారం లేకుండానే పరేడ్ నిర్వహించారు. ఇప్పుడు విజయ్ ఎంత మంది వస్తారనే సమాచారం లేకుండానే ర్యాలీ చేశారా.. తెలిసి కూడా కావాలనే చేస్తున్నారా. ఇదంతా ఎందుకు చేస్తున్నారు.. ఎవరి కోసం చేస్తున్నారు. ప్రజల ప్రాణాల మీదకు వచ్చే ఇలాంటి ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించడం అవసరమా. తొక్కిసలాట ఘటనలు జరుగుతున్నప్పుడు ఆ మాత్రం జాగ్రత్త పడకపోతే ఎలా. అభిమానుల ప్రాణాలంటే మరీ అంత చులకన అయిపోయారా అన్న విమర్శలు వస్తున్నాయి, కొన్ని సార్లు పోలీసులు వద్దని హెచ్చరికలు చేసినా వినట్లేదు. చివరకు పోలీసుల వైఫల్యం అని వాళ్ల మీద నెట్టేయడం సాధారణం అయిపోయింది. ఎంత హీరో అయినా.. సెలబ్రిటీ- అయినా పెద్ద సభలు పెట్టే ముందు ఆలోచిస్తే మంచిదని సూచిస్తున్నారు.

# మండలిలో కాఫీ రగడ

అమరావతి, ఏపీ శాసనమండలి సమావేశాల్లో కాఫీ విషయంలో రగడ చోటు చేసుకుంది. మండలిలో ఇచ్చే కాఫీకి, అసెంబ్లీలో ఇచ్చే కాఫీకి తేడా ఉంటోందని మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభలో, మండలిలో ఒకే రకమైన కాఫీ, భోజనాలు లేవంటూ వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీనిపై శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. శాసనసభ, మండలిలో కాఫీ, భోజనాల విషయంలో తేడా ఎక్కడా లేదని వివరణ ఇచ్చారు.ఎక్కడైనా చిన్న పొరపాట్లు జరిగితే పునరావృతం కాకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ విషయంపై సభలో చర్చ జరపాలంటూ వైసీపీ ఎమ్మెల్సీలు పట్టుబడుతూ సభను స్తంభింపచేశారు. సభలో తీవ్రమైన గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఛైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. ఇదిలా ఉండగా... శనివారం ఉదయం శాసన మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ మొదలవగా ఛైర్మన్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే వైసీపీ సభ్యుల ఆందోళనతో ప్రశ్నోత్తరాలకు అంతరాయం ఏర్పడింది. ఛైర్మన్‌కు గౌరవం ఇవ్వాలంటూ వైసీపీ ఆందోళనకు దిగింది. ఛైర్మన్‌కు అవమానం అంటూ వైసీపీ సభ్యులు నల్ల కండువాలతో సభకు వచ్చారు . ఈ విషయంలో కల్పించుకున్న మంత్రి పయ్యావుల.. బ్రేక్ సమయంలో ఛైర్మన్ చాంబర్‌లో చర్చిద్దామని అన్నారు. అయితే ముందు చర్చలు జరిపిన తర్వాతే సభ జరుపుదామని వివక్షనేత బొత్స సత్యనారాయణ పట్టుబట్టారు. ఈ క్రమంలో కాసేపు సభలో రగడ చోటు చేసుకుంది.

# పర్యాటకంతో ఎన్నో దేశాలు అభివృద్ధి

విజయవాడ,ప్రస్తుతం కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలో టూరిజం కీలకంగా మారిందని, టూరిజాన్ని నమ్ముకునే అభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టూరిజం వల్ల ఏజెన్సీలోనూ అనేక మంది ఉపాధి పొందుతున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం.. ఇది గేమ్ ఛేంజర్. పర్యాటక ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు ఇస్తున్నామని అన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం మాట్లాడారు. మా చిన్నప్పుడు గుడికి వెళ్లడమే టూరిజం అనుకునేవాళ్లం. పర్యాటకం విషయంలో ప్రజల ఆలోచనలు మారాయి. ఆ ఇజం.. ఈ ఇజం లేదు.. ఇప్పుడు ప్రతిచోటా టూరిజం. ప్రపంచంలో ఎక్కువ మంది టూరిస్టులు భారత్ నుంచే వెళ్తున్నారు. మన దేశంలో ఉన్న పర్యాటక కేంద్రాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. దేశీయ పర్యాటకులను ఆకర్షిస్తే చాలు.. వివిధ రకాల ఆదాయం వస్తుంది. అందరితో చర్చించి మెరుగైన టూరిజం పాలసీ తీసుకొచ్చాం. పర్యాటక కేంద్రాల్లో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు జరిగేలా చూడాలి. పర్యాటకులు కొన్ని రోజులు ఉండేలా చూడాలి. ఇప్పుడు వెల్‌నెస్ సెంటర్లకు డిమాండ్ పెరుగుతోంది. పర్యాటక కేంద్రాలను బాగా మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. కూచిపూడి, కొండపల్లి, ఏటికొప్పాకను అభివృద్ధి చేస్తాం. గండికోట, అరకులో ఉత్సవాలు నిర్వహించాం. దసరా అంటే కోల్‌కతా, మైసూరే కాదు.. విజయవాడ కూడా గుర్తుకు రావాలి. దేశంలోనే నెంబర్ వన్ సిటీ-గా విజయవాడ నగరం మారతుంది. రాయలసీమలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నాం. మనకు తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, కాణిపాకం శ్రీకాళహస్తి ఉన్నాయని సీఎం వివరించారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ హోమ్ స్టే పోర్టల్‌ను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బోండా ఉమా తదితరులు పాల్గొన్నారు. ఏపీలో పర్యాటక రంగానికి స్వర్ణ యుగం లాంటి దశ, దిశను సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. 15 నెలల కాలంలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం వచ్చిందని ఉద్ఘాటించారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఏపీ కార్వాన్ టూరిజం బస్సులను పరిశీలించారు సీఎం. బస్సులో ఉన్న సౌకర్యాలు, వసతులు గురించి సీఎంకు వివరించారు అధికారులు. బస్సులో డైనింగ్ తరహా ఏర్పాట్లు- కూడా ఉంటే బాగుంటుందని సూచించారు సీఎం. ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుని.. అవసరమైతే మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగించారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి అందాలను అభివృద్ధి చేయడం ద్వారా నేడు అద్భుతమైన ప్రదేశాలుగా మారాయని వివరించారు. పర్యాటక రంగంలో సుస్థిరమైన మార్పు వచ్చిందని చెప్పడానికి ఏపీ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు.

# వంటింట్లో నూనెల మంట

న్యూఢిల్లీ,పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. జిఎస్టీ తగ్గి ధరలు దిగివస్తాయనుకుంటున్న వేళ వంటనూనెలు మంటపుట్టిస్తున్నాయి. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 172 రూపాయలకు చేరింది. జిఎసటీ రేట్లు తగ్గించిన సమయంలో దిగిరావాల్సిన నూనెలు మండుతున్నాయి. ఈ మధ్య కాలంలో 142 వరకు ఉన్న సన్‌ఫ్లవర్ ధర ఏకంగా 30 రూపాయలు పెరిగింది. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.230 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్నిపెంచింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పామాయిల్ నుంచి సోయా వరకు అన్ని రకాల వంటనూనెల ఖరీదయ్యాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, రేట్ల పెంపు ప్రభావం నేరుగా సామాన్య జనంపై పడింది. నూనెలను ఎక్కువగా వినియోగించే పండుగ సీజన్‌లో, సరైన టైమ్ చూసి సర్కారు దెబ్బకొట్టింది.

# నరక కూపంగా సంక్షేమ హాస్టళ్లు

హైదరాబాద్,జ్వరాల భయంతో హాస్టళ్లు వణికిపోతున్నాయి. కల్తీ ఆహారం కూడా కలవర పెడుతోంది. ఇకపోతే హాస్టళ్లలో ఉండేలా పరిస్థితులు లేవని దారుణ పరిస్థితులను కళ్లకు అద్దం పడుతున్నాయి. పదేళ్ల పాటు హాస్టళ్లను సంస్కరించామని చెప్పుకుంటున్న బిఆర్‌ఎస్ నేతలు దీనిపై కళ్లు తెరవాలి. ఇప్పుడే హాస్లళ్లలో సమస్యలు లేవు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరవాత వీటిని సంస్కరించలేదు. వాటి మానాన వాటిని వదిలేశారు. ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టారు. సన్న బియ్యం సరఫరా పేరుతో కొన్ని రోజులు ఆర్భాటం చేశారు. అయితే సమస్యలన్నింటికి ..ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కారణమంటూ చేస్తున్న విమర్శలు వారి కుసంస్కారానికి నిదర్శనంగా చూడాలి. అన్ని రంగాలను విస్మరించినట్లుగానే వసతి గృహాలను కూడా పదేళ్లుగా పక్కన పెట్టేశారు. హాస్టళ్లలో వసతులు, పరిస్థితులు బాగులేక విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఇటీవలకాలంలో హాస్టళ్లలో విద్యార్థులు మృతి చెందడం అధికారులు, ప్రజాప్రతినిధులను కలవరానికి గురిచేస్తోంది. సీజనల్ వ్యాధుల ముప్పును తప్పించుకునేందుకు పలుచోట్ల వైద్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటు న్నప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రావడంలేదు. హాస్టళ్లలో కొన్నిచోట్ల మురుగునీరు పారుతోంది. మరికొన్ని చోట్ల డంప్‌యార్డులు, పారిశుధ్య సమస్య, ఇతర ఇబ్బందులుంటున్నాయి. ఇటీవల వర్షాలతో ఒక్కసారిగా దోమలు, ఈగలు ప్రబలడంతో జ్వరాల మోత మోగుతోంది. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, బాడీ పెయిన్స్, అలసట తదితరసమస్యలతోనే విద్యార్థులు బాధపడుతున్నారు. గిరిజన, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, ఎంజేపీ, కస్తూర్బా, ఆదర్శ, జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర అన్ని గురుకులాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. వీరిలో అనేకమంది సీజనల్‌వ్యాధులబారిన పడుతున్నా యంత్రాంగం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. హాస్టళ్లలో సిబ్బంది విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టకపోవడం శాపంగా మారుతోంది. కొన్నిచోట్ల కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, నాణ్యతలేని ఆహారం అందిస్తూ అందిన కాడికి దోచుకుంటు న్నారు. సంబంధిత ఆహార సరఫరా కాంట్రాక్టర్లు, సిబ్బంది మిలాఖత్ కావడం అధికారులు పట్టించుకోక పోవడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వివిధ రకాల సీజన ల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# బీజేపీ- జేడీయూ అవుట్?

పాట్నా:ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది.. బిహార్. అక్టోబర్/ నవంబర్ లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన కసరత్తును కొనసాగిస్తోంది కేంద్ర ఎన్నికల సంఘం. బీహార్ ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికారంలో ఉన్న జనతాదళ్ (యునైటెడ్)- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వానికి సారథ్యాన్నివహిస్తోన్న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఓటర్లపై వరాల జల్లు కురిపిస్తూ వస్తోన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో లోక్‌పోల్ తాజాగా ప్రీ-పోల్ సర్వే నిర్వహించింది. తన అంచనాలను వెల్లడించింది. అధికార ఎన్డీఏ, మహాకూటమి మధ్య హోరాహోరీ పోరు నెలకొంటుందని అంచనా వేసింది. బీజేపీ- జనతాదళ్ (యునైటెడ్) కూటమికి 105-114 స్థానాలు గెలుచుకుంటుందని తెలిపింది. ఆర్జేడీ- కాంగ్రెస్ సారత్యంలోని మహాకూటమి.. 118-126 స్థానాలు దక్కించుకుంటుందని లోక్ పోల్ సర్వే పేర్కొంది. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 2 నుంచి5 స్థానాలు పొందవచ్చు. ఇది- బీహార్ ఎన్నికల్లో అనూహ్య పోటీకి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. జోన్ల వారీగా చూసుకుంటే- భాగల్‌పూర్: ఎన్డీఏ- 6 నుండి 8, మహా కూటమి: 4 నుండి 5 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. దర్భంగా: ఎన్డీఏ 15 నుండి 17, మహా కూటమి 11 నుండి 13 సీట్లు సాధించవచ్చని అంచనా. కోసి: ఎన్డీఏ 6 నుండి 7, మహా కూటమి 5 నుండి 6 సీట్లు గెలుచుకోవచ్చని సర్వే సూచిస్తోంది. మగధ్: ఎన్డీఏ 14 నుండి 16 సీట్లతో ఆధిక్యంలో ఉండగా, మహా కూటమి 10 నుండి 12 సీట్లు పొందవచ్చు. ముంగేర్: ఎన్డీఏ- 10 నుండి 11, మహా కూటమి- 10 నుండి 12 సీట్లు గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి. పాట్నా జోన్‌లో మహా కూటమి 26 నుండి 28 సీట్లతో బలమైన పట్టును నిరూపించుకోగా, ఎన్డీఏ 14 నుండి 16 సీట్లు సాధించవచ్చు. పూర్ణియా జోన్‌లో ఎన్డీఏ, మహాకూటమికి చెరో 10 నుండి 11 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని లోక్ పోల్ సర్వే వెల్లడించింది. సారన్: మహా కూటమి 12 నుండి 13 సీట్లతో ఎన్డీఏ కంటే ముందంజలో ఉంది. తిర్హుట్ జోన్‌లో ఎన్డీఏ- 25 నుండి 27, మహా కూటమి 21 నుండి 22 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది.

# మానవాభివృద్ధికి దోహదపడని ఆర్థిక ప్రగతి దేనికి?



న్యూఢిల్లీ,భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల కాలంలో వివిధ దేశాల పర్యటనలో భాగంగా, భారతదేశం ప్రపంచంలో నాల్గవ ఆర్థిక అభివృద్ధి చెందిన దేశంగా మారుతున్నదని చెప్తున్నారుభారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల కాలంలో వివిధ దేశాల పర్యటనలో భాగంగా, భారతదేశం ప్రపంచంలో నాల్గవ ఆర్థిక అభివృద్ధి చెందిన దేశంగా మారుతున్నదని చెప్తున్నారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తే, భారతదేశం ప్రపంచంలో నేడు ఆర్థికంగా శక్తివంతంగా ఉన్న అమెరికా, చైనా, రష్యా, జపాన్ తదితర దేశాలను వెనక్కి నెట్టి భారతదేశం నిజంగానే ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తుందా అని లోతుగా ఆలోచిస్తే అనేక రకమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకనగా ఒకపక్క ప్రపంచ మానవ అభివృద్ధి సూచిలో భారతదేశం నేటికీ 193 దేశాల్లో 130వ స్థానంలో ఉండగా, భారతదేశం ఆర్థిక ప్రగతిలో నాల్గవ స్థానంలో ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదే పదే చెప్తే అబద్ధాలు నిజం అవ్వవు కదా..! అసలు మానవ అభివృద్ధి లేకుండా..? ఆర్థిక ప్రగతిని సాధించడం ఏంటి..? నేడు 140 కోట్ల మంది ఉన్న భారతీయుల్లో అత్యంత అభివృద్ధికి దూరంగా ఉంటూ, మధ్యతరగతి జీవితాన్ని గడుపుతున్నది ఎవరంటే సామాన్యులు నిరుపేదలైన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలే కనీస మౌలిక సదుపాయాలు అందక దుర్భర జీవితాన్ని గడుపుతూ, ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత పథకాల కోసం తాపత్రయపడుతున్నారు. కానీ ఒకపక్క కేంద్ర ప్రభుత్వం ప్రపంచ దేశాలనే తలదన్ని భారతదేశం మూడవ లేదా నాల్గవ ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదుగుతున్నమని చెప్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దేశంలో ఉన్న 10% అగ్రవర్ణాల అభివృద్ధిని 100 కోట్ల పైగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధిగా కేంద్ర ప్రభుత్వం మరి ముఖ్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పడం అంటే దేశంలో మెజారిటీగా ఉన్న అణగారిన వర్గాలని మోసం చేయడమే కదా..! అగ్రవర్ణాలకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధి జరుగుతూ అణగారిన వర్గాలకి తరతరాలుగా అన్యాయం జరుగుతుందని అనేక గణంకాల ప్రకారం నిరూపితం అవుతున్నది. అది ఎలా అంటే నేడు దేశంలో 10% ఉన్న అగ్రవర్ణాలు ప్రభుత్వ విద్యా సంస్థలను కాదని అత్యంత ఆధునిక సౌకర్యాలు కలిగిన కార్పొరేట్ విద్యని పొందుతున్నారు. అత్యంత ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ వైద్యాన్ని పొందుతున్నారు. కానీ 100 కోట్ల పైబడి ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు మాత్రం ప్రభుత్వాలనుండి మెరుగైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి లభించక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యని నిర్లక్ష్యం చేసి నిరుపేదలైన సామాన్యులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి లకు ఉచిత ప్రభుత్వ విద్యని కల్పించకపోవడం వల్ల అటు కార్పొరేటు విద్యని కొనలేక అణగారిన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు పస్తులు ఉంటూ, అప్పుల పాలు అవుతూ, ఉన్న కొద్ది ఆస్తిని అమ్ముకొని తమ బిడ్డల భవిష్యత్ కోసమని ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిస్తున్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఉచిత వైద్యాన్ని అందించకపోవడం మూలంగా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని కొనలేక, ప్రభుత్వ వైద్యశాలలో సరైన సదుపాయాలు లేక అణగారిన వర్గాలకి చెందిన వేల, లక్షల కుటుంబలు అనారోగ్యాల బారినపడుతున్నారు. సరైన విజ్ఞానంతో కూడిన స్కిల్స్ లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధి నిరుద్యోగులకు కల్పించకపోవడం మూలంగా లక్షల మంది అణగారిన వర్గాల నిరుద్యోగులు దినసారి కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇక అగ్రవర్ణాల కబంధహస్తాల్లో వేల, లక్షల ఎకరాల భూమి ఉండడం చేత అణగారిన వర్గాల చేతుల్లో భూమి లేకపోవడం వలన పీడిత వర్గాలకు చెందిన లక్షల కుటుంబాలు ప్రభుత్వాలు ఉచిత భూమిని కల్పిస్తే స్వశక్తితో వ్యవసాయం చేసుకొని ఆత్మగౌరవంతో బతకాలని వేచిచూస్తున్నారు. మరి అలాంటి కుటుంబాలకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత భూపంపిణీ చేస్తే, దేశంలో అభాగ్యులుగా ఉండి పేదరికంలో ఉన్న లక్షల మంది అణగారిన వర్గాల కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తాయి కదా..! మరి మౌలిక సదుపాయాలైన విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి విషయంలో ఇంతటి తారతమ్యాలు ఉంచుకొని అగ్రవర్ణాల ప్రగతిని మొత్తం దేశం ప్రగతిగా చూపిస్తే, కోట్లమంది అణగారినవర్గాలు అభివృద్ధికి దూరంగా జీవిస్తున్నారు కదా..! దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏ విధంగా భారతదేశం ఆర్థికంగా చాలా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ నాల్గవ ఆర్థిక శక్తి కలిగిన దేశంగా తయారవుతున్నమని చెప్తారు. నేడు ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, చైనా, రష్యా, జపాన్ మొదలగునవి అక్కడి ప్రజలకి మౌలిక సదుపాయాలన్నీ సమృద్ధిగా కల్పించి, ఆ తర్వాత ఆర్థిక ప్రగతిని సాధించాయి తప్ప, ఆయ దేశాల మానవ అభివృద్ధిని సాధించకుండా ఆర్థిక అభివృద్ధి పైనే దృష్టి పెట్టలేదు. కానీ భారతదేశంలో మాత్రం మానవ అభివృద్ధి లేకుండా ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నామని దేశ ప్రధాని నరేంద్ర మోడీ చాలా గర్వంగా పదేపదే చెప్తున్నారు. అంటే ఒక రకంగా దేశ ప్రజలను మరి ముఖ్యంగా అత్యంత కడు పేదరికంలో ఉన్న అణగారిన వర్గాలని మభ్యపెడుతూ మోసం చేస్తున్నరాని చెప్పడానికి నిదర్శనం కదా..! కాబట్టి ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమ విధానాన్ని మార్చుకొని మానవ అభివృద్ధిని సాధిస్తూ, అందులో భాగంగా దేశంలో ఉన్న కుల, మత తారతమ్యాలని అధిగమిస్తూ భారత పౌరులకి సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, మానవ అభివృద్ధిలో భాగంగా దేశ ఆర్థిక అభివృద్ధిని భాగం చేయాలి తప్ప, మానవ అభివృద్ధిలేని ఆర్థిక ప్రగతి సాధించడం అంటే అది ఆధునిక అనాగరిక చర్యకు నిదర్శనంగా గ్రహించాలి. కాబట్టి దేశంలో ఉన్న కుల, మతాలకతీతంగా భారతీయ పౌరులందరికీ సౌకర్యవంతమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, మరోపక్క ఆర్థిక ప్రగతిని సాధిస్తే, అప్పుడు మాత్రమే భారతదేశం మానవ అభివృద్ధి సూచీలో అత్యంత ఉన్నత స్థానంలో ఉంటది, ఆర్థికంగా కూడా బలమైన దేశంగా ఎదుగుతాదని మేధావులు, విద్యావంతులు, సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

## తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

తిరుమల, శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం 8 గంటలకు శేషాచలాధీశుడు శ్రీ కోదండ రాముని అవతారంలో ధనుస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి దర్శనమిచ్చారు.

# వరద నివారణ ప్రణాళిక తప్పనిసరి వరద నివారణ ప్రణాళిక తప్పనిసరి

హైదరాబాద్, గతంలో ఎన్నడూ లేని విధంగా రుతుపవనాల ప్రభావంతో అకస్మాత్తుగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. నగరాలు సాగరాలను తలపిస్తున్నాయి. ఈ పరిస్థితిని తట్టుకునే విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రుతుపవనాల ప్రభావంతో అకస్మాత్తుగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. నగరాలు సాగరాలను తలపిస్తున్నాయి. ఈ పరిస్థితిని తట్టుకునే విధంగా నగరాలు సంసిద్ధంగా ఉన్నాయా? ఒకవైపు చెరువులు, గుంతలు, వాగులు కబ్జాకు గురికావడం మరో వైపు వరద నీరు బయటకు వెళ్లే దారిలేకపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మారిన పరిస్థితుల వల్లనే నగరాల్లో కుండపోత వర్షాలు పడుతున్నాయని, హైదరాబాద్ లోనూ అకస్మాత్తుగా వర్షాలు కురుస్తున్నాయని, నగరంలో 2 సెం.మీ వర్షం కురిస్తే అస్తవ్యస్తం అవుతోందని ఆదివారం (28.9.25 )ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన చెందడం సహజమే. వరద నీటిని నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవలసిన అవసరం ఉందన్నారు. మూసీ నది మహోగ్రరూపం నగరాన్ని ఎంత అల్లకల్లోలం చేసిందో అందరికీ తెలిసిందే. నగరం మధ్యలోంచి 55 కి.మీ పొడవునా ప్రవహిస్తోన్న మూసీనది వెంబడి జియాగూడ, చాదర్‌ఘాట్, గోల్నాక, అంబర్‌పేట ఇలా ఎక్కడ చూసినా మూసీకి ఆక్రమణలే. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు వరదల్లో చిక్కుకుని 2 వేల మంది మృత్యువాత పడ్డారు. ఆ తరువాత 62 ఏళ్లకు 1970 లో వరదలు వచ్చాయి.

అనంతరం 30 ఏళ్లకు 2000 లో వచ్చిన వరద నగరాన్ని ముంచెత్తింది. మూసీ వరద ముప్పు నివారణకు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలు నిర్మించినా ఏం లాభం? ఆక్రమణలతోనే పదేపదే వరదలు వస్తున్నాయి. 2008, 2014, 2016, 2018, 2020 లోనూ వరదలు వచ్చాయి. మరోసారి ఈ ప్రమాదాలు ఎదురు కాకుండా ఉండాలంటే బహుముఖ ప్రణాళికలు అవసరం. %ూశ్రీంశీ =ముం% - మానవాభివృద్ధికి దోహదపడని ఆర్థిక ప్రగతి దేనికి? భాగ్యనగరంలో ఒకప్పుడు వందలాది చెరువులు ఉండేవి. చివరకు 134 సరస్సులు ఆక్రమణల పాలైనట్టు గుర్తించారు. ఈ సరస్సుల చుట్టూ 14,061 ఆక్రమణలు బయటపడ్డాయి. మొత్తం ఆక్రమణల్లో 85 శాతం కేవలం 30 నీటివనరుల్లోనే గుర్తించగా, 15% 104 సరస్సుల చుట్టూ ఉన్నట్టు గుర్తించారు. హైడ్రా ఏర్పాటుతో అక్రమ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపడం కొనసాగుతోంది. ఆక్రమణలను తొలగించడంతోపాటు వరద కాల్వలను సరిగ్గా నిర్వహించడం తప్పనిసరి. నగరంలోని వరద కాల్వల్లో ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఏటా 5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక వస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట వంటి ప్రాంతాల్లో వరదనీటి కాలువలు మూసుకుపోయాయి. బంజారా హిల్స్‌లో 20 ఏళ్ల క్రితం వేసిన వరదనీటి పైపులు రోడ్డుకు 10 అడుగుల లోతున కూరుకుపోయాయి. నేతల అంచనాలు తలకిందులు ప్రస్తుతం రుతుపవనాల పోకడలో మార్పు కనిపిస్తోంది. దేశంలో 100 నుంచి 120 రోజులకు రుతుపవనాలు విస్తరించగా కొన్ని గంటల్లోనే భారీగా వర్షపాతం నమోదవుతోంది. గత మే నెలలో ముంబైలో కేవలం 24 గంటల్లోనే 135.4 మి.మీ వర్షం కురిసింది. ఆ మరునాడు 161.9 మి.మీ వర్షం పడింది. అదే రోజు ఢిల్లీలో కొన్ని గంటల్లోనే 81 మి.మీ వర్షపాతం నమోదైంది. గురుగావ్, కోల్‌కతా వంటి నగరాలు కూడా జడివానలతో అల్లకల్లోలమయ్యాయి. పంజాబ్‌లో 23 జిల్లాలు దెబ్బతిన్నాయి. అప్పటి



వాతావరణానికి తగినట్టు నిర్మాణమైన నగరాలు ఇప్పటి మారుతున్న వాతావరణానికి తగినట్టు సిద్ధమైతేనే ప్రజలకు భద్రత కలుగుతుంది. మురుగునీరు, వాననీటి కాలువలు కాలం చెల్లిన వ్యవస్థలుగా మారాయి. పాత పద్ధతి ప్రకారం జూన్ రుతుపవనాల క్యాలెండర్ బట్టి రుతుపవనాలకు ముందు, తరువాత ఈ కాలువలను శుభ్రం చేస్తున్నారు. కానీ వ్యర్థాల నిర్మూలన విస్మరిస్తున్నారు. కాలువలను తాజాగా ఎంత పరిశుభ్రం చేసినా వ్యర్థాలను తొలగించలేనిదే ప్రయోజనం కలగదు. సమస్య అలాగే కొనసాగుతుంది. శానిటేషన్, మురుగు కాలువల పర్యవేక్షణ విభాగాల మధ్య సమన్వయం అవసరం. ఇలాంటి సమన్వయం వల్లనే విజయవాడలో సత్ఫలితాలు వచ్చాయి. రుతుపవనాల ప్రతిస్పందన బృందాల్లో శానిటేషన్, ఇంజినీరింగ్, ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రయోజనం చేకూర్చాయి. %ూశ్రీంశీ =ముం% - యువత నెత్తురులో ప్రవహించే ఉత్తేజం.. భగత్‌సింగ్ ఫలితంగా వరదనీటి ముప్పు ప్రజలకు తప్పింది. కోల్‌కతా నగరంలో ఫరక్కా బ్యారేజిలో పూడిక తీయకపోవడంతో గంగానదిపై 300 కి.మీ ఎగువన వరదనీరు ఉప్పొంగి సెప్టెంబర్ 23న కలకత్తా నగరాన్ని ముంచెత్తింది. తొమ్మిది మంది మృతి చెందారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకు కాలువలు, మురుగునీటి పారుదల నిర్వహణకు విస్తృతమైన నెట్‌వర్క్ ఉండేది. నగరంలోని మురుగు నీటినంతా తూర్పు కోల్‌కతాలోని తేమ భూముల్లోకి పంపించేవారు. అయితే ఈ తేమభూములు కబ్జాల పాలు కావడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ మురిగిపోయింది. ఈ నేపథ్యంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి గత ఫిబ్రవరిలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ. 200 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేసినా ఇంకా పనులు ప్రారంభం కాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అశ్రద్ధకు తార్కాణం. - నదీనదాలు.. ప్రజోపయోగ నిధులు కలకత్తా ఇప్పుడు వరద నీటిలో మునిగి తేలడానికి ఫరక్కా బ్యారేజి, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సంస్థలే ప్రధాన కారణమని మమతా బెనర్జీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. బొంబాయి తీవ్ర వర్షపాత సంఘటనలతో అల్లాడుతోన్న సంగతి తెలిసిందే. అక్కడి బృహన్ ముస్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) వర్షపు నీటి కాలువల (స్టార్మ్‌వాటర్ డ్రైన్లు) సామర్థ్యాన్ని విస్తరింపజేయడానికి కొత్త ప్రణాళిక రూపొందిస్తోంది. ఒక గంటలో 120 మి.మీ వరకు వర్షం ఏకధాటిగా కురిసినా తట్టుకునేలా కాలువలను వెడల్పు చేస్తామని ప్రకటించింది. ఈ విధంగా నగరాల్లోని కాలువలను వెడల్పు చేసి సామర్థ్యాన్ని పెంచడం తప్పనిసరి.

# హైడ్రా చర్యలతో చెరువులకు కళ

హైదరాబాద్, హైదరాబాద్‌తో పాటు నగరంతోపాటు నగరం చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను అమలు చేస్తోంది. బతుకమ్మ కుంటను రక్షించడం ఓ పెద్ద విజయంగా చూడాలి. నిజానికి శుక్రవారం ఇది ప్రారంభం కావాల్సి ఉన్నా వర్షాల కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే అనేక చెరువులకు హైడ్రా విముక్తి కలిగించింది. అనేక ఆక్రమణలను తొలగించింది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొ నేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్‌ఆర్‌ఎస్‌సీ నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్‌ఆర్‌ఎస్‌సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్‌లోని ఎన్‌ఆర్‌ఎస్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు. కొందరు అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్‌ఆర్‌ఎస్‌సీ పటాలు ఉపయోగపడతాయి. ఎన్‌ఆర్‌ఎస్‌సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశోధన సంస్థను కోరడం గమనార్హం. ఈ క్రమంలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గతంలో ఉన్న చెరువులు నాలాలు గుర్తించి త్వరగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో చెరువుల రక్షణపై మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోబోతున్నారు.

# షాక్ ఇవ్వబోతున్న బీజేపీ

పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి ఇపుడు అతి పెద్ద పరీక్ష అన్నది తెలిసిందే. ఎందుకంటే 2024 లోక్ సభ ఎన్నికల తరువాత వరుసగా హర్యానా మహారాష్ట్ర ఢిల్లీ అసెంబ్లీలను బీజేపీ మిత్రులు కలసి గెలుచుకున్నాయి. అదే ఊపులో ఇపుడు బీహార్ ని కూడా గెలవాల్సి ఉంది. పైగా 2024లో తగ్గిన సీట్ల కోత కి చెక్ పెట్టి హిందీ బెల్ట్ లో కాషాయ హవా ఏ మాత్రం తగ్గలేదని రుజువు చేసుకోవాల్సి ఉంది. దాని కోసం బీజేపీ చేయాల్సింది అంతా చేస్తోంది అని అంటున్నారు.

ఆపరేషన్ స్టార్ట్ :

బీహార్ ఎన్నికలు నవంబర్ లో జరుగుతాయి. ఇక అభ్యర్థుల ఎంపిక మీద బీజేపీ అపుడే ఫోకస్ పెట్టేసింది. 2020లో జేడీయూ తో పొత్తు పెట్టుకుని పోటీ చేస్తే 80 అసెంబ్లీ సీట్లు బీజేపీకి దక్కాయి. ఇపుడు ఆ సంఖ్యను మరింతగా పెంచుకోవాలన్నది బీజేపీ ఆలోచన. ఎందుకు అంటే ఈసారి బీహార్ పీఠం మీదనే బీజేపీ నేరుగా గురి పెట్టేసింది. త్యాగాలను పక్కన పెట్టి బీహార్ సీఎం అయిపోవాలని చూస్తోంది. దానికి అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉంటేనే బీజేపీ మాట నెగ్గుతుంది దాంతో బీహార్ ఆపరేషన్ ని బీజేపీ స్టార్ట్ చేసింది అని అంటున్నారు.

వారిక ఇంటికే :

బీహార్ లో ఈసారి అన్ని విషయాలు ఆలోచించి టికెట్లు అభ్యర్థులకు ఇవ్వాలని బీజేపీ చూస్తోంది. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఒడ్డున పడిన వారికి ఈసారి టికెట్ కట్ అని అంటోంది. అలాగే 70 ఏళ్ళు నిండిన వారిని పార్టీలో నియోజకవర్గంలో అంతగా పాపులారిటీ లేని వారిని కూడా సైడ్ చేయాలని అనుకుంటోంది. అదే విధంగా గెలుపు డౌట్ అని కనుక తెలిస్తే ఇక రెండవ ఆలోచన లేకుండా టికెట్ ని నిరాకరించాలని చూస్తోంది అని అంటున్నారు. అంతే కాదు ఈసారి ఎన్నికలు హోరా హోరీగా జరగబోతున్నాయి. ఇండియా కూటమి కూడా గట్టిగానే ఉంది. రేపటి రోజున మెజారిటీ దగ్గర నంబర్ గేం కనుక స్టార్ట్ అయితే విధేయత అన్నది చాలా ముఖ్యం. దాంతో పార్టీకి ఎవరైతే విధేయతగా ఉంటారో వారికే టికెట్ ఇవ్వాలని నిర్ణయించుకుంది అని అంటున్నారు.

లాబీయింగ్ వద్దంటూ :

ఈసారి అభ్యర్థులను జిల్లా స్థాయి నుంచి జాబితాలను కోరడం ద్వారా రాష్ట్ర జాతీయ నాయకత్వం తీసుకుంటుంది. అక్కడ కూడా విధేయత గెలుపు గుర్రాలు అన్న రెండు ప్రమాణాలు తప్ప మరో దానికి ఎలాంటి ఆస్కారం ఇవ్వరాదని చెబుతున్నారు. అంతే కాదు అన్ని రకాలుగా జిల్లా నేతలతో అభిప్రాయ సేకరణ జరిపి మాత్రమే లిస్ట్ ని తీసుకుంటారు అంటున్నారు. ఈ ప్రక్రియలో ఆశావహులని దూరంగా ఉంచాలని చూస్తున్నారు. ఇక ప్రతీ నియోజకవర్గం నుంచి అయిదు నుంచి ఏడుగురు వంతున ఆశావహుల పేర్లను బలమైన అభ్యర్థులుగా తీసుకుంటారు అని అంటున్నారు. ఆ మీదట అనేక వడపోతల అనంతరం తుది ఎంపిక ఉండొచ్చు అని చెబుతున్నారు.

బీజేపీ నంబర్ ఇదే :

ఇక జేడీయూతో పొత్తుతో బరిలోకి దిగుతున్న బీజేపీ మొత్తం 243 సీట్లు ఉన్న బీహార్ అసెంబ్లీలో 103 సీట్లకు తాను స్వయంగా పోటీ చేయాలని చూస్తోంది. అంటే మిగిలిన 130 సీ ట్లనే మిత్రులకు వదిలేస్తుంది అన్న మాట. గతసారి కుటుంబ సభ్యులకు పలుకుబడి ఉంటే చాలు అనుకున్న వారికి టికెట్లు ఇచ్చింది కానీ ఈసారి కుటుంబ సభ్యులకు నో టికెట్ అని చెబుతోంది. దాంతో బీజేపీ లెక్క కూడా పక్కాగా ఉండబోతోంది. ఇదంతా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఆయన పర్యవేక్షణలో జరగబోతోంది అని అంటున్నారు.

## అమరావతికి బాబు బ్రాండ్

విజయవాడ,అమరావతికి బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని నటుడు, తెలుగుదేశం పార్టీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఏపీ దేశ పటంలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని నొక్కిచెప్పారు. ఏపీలో ఆర్థిక సమస్యలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. శనివారం విజయవాడ ఉత్సవ్-2025 లో భాగంగా గొల్లపూడిలో ఎగ్జిబిషన్‌ను బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆశీస్సులు, కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. 46 రోజులపాటు- ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. 11 రోజుల పాటు- కనక దుర్గమ్మను వివిధ రూపాల్లో అలంకరిస్తారని వివరించారు. కళకు చావు లేదని.. కళలను నేటి తరానికి చాటి చెప్పాలని ఉద్ఘాటించారు. కూచిపూడి, తోలు బొమ్మలు కృష్ణా జిల్లాలో ప్రాచుర్యం పొందాయని వ్యాఖ్యానించారు. సినిమాలకు రాజధాని విజయవాడ అని నొక్కిచెప్పారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతోమంది తోడ్పడ్డారని తెలిపారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని ఉద్ఘాటించారు.

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించామన్నారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

# సాగునీటి సంఘాలతో చెరువుల నిర్వహణ

హైదరాబాద్,సాగునీటి సంఘాలతో చెరువులు, కాలువలు నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. మొదట చెరువులతో ప్రారంభించి పెద్ద ప్రాజెక్టుల వరకు విస్తరిస్తామన్నారు. ప్రతి సంఘానికి నీటిపారుదలశాఖ నుంచి ఒక అధికారి కన్వీనర్‌గా ఉంటారని చెప్పారు. రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్, సభ్యులతో చర్చించిన తర్వాత సంఘాలు ఏర్పాటు చేస్తాం. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని గతంలో కోదండరెడ్డి కోరారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచాలన్న కర్ణాటక నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో వాదిస్తాం. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రాజెక్టులపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై చేసిన కామెంట్స్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ప్రాజెక్టులపై పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం అడ్డగోలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే ఉందని ఆయన గుర్తుచేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపుకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఎత్తు పెంచకుండా అడ్డుకుంటామని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. కోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని తెలిపారు. కృష్ణా, గోదావరి నీటి వాటాలో కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయమే జరిగిందని ఆరోపించారు. కేటీఆర్ తన మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఉత్తమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ఆనకట్ట కోసం సవరణలతో డీపీఆర్ సిద్ధం చేస్తాం. కేబినెట్ ఆమోదం తర్వాత ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపడతాం. చిన్న కాళేశ్వరం, కల్వకుర్తిపై కేబినెట్ పరిశీలనకు చర్యలు తీసుకుంటాం అని ఉత్తమ్ తెలిపారు.



ఆల్మట్టి ఎత్తు పెంచొద్దనే అంశంపై సుప్రీం కోర్టులో స్టే ఉంది. ఈ ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మేం వ్యతిరేకం. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేస్తాం. వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించాం. కృష్ణా, గోదావరి జలాల్లో కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. గత పదేళ్లలో నదీజలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయమే జరిగిందన్నారు. ఇదిలావుంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేపు(మంగళవారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం 6:45 గంటలకు శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనం అవుతారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఉత్తమ్ కలువనున్నారు. ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల పంట ప్రొక్యూర్ చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 52 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్మెంట్ మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చిందని చెప్పారు. మిగిలిన ధాన్యం ప్రొక్యూర్మెంట్‌కు కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని గోదాముల్లో, రైస్ మిల్లులో ధాన్యం నిండిపోయి ఉందన్నారు. ధాన్యం తలింపుకు 300 ట్రైన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తానని మంత్రి ఉత్తమ్ వివరించారు. మంగళవారం ఢిల్లీ వెళ్లి ప్రహ్లాద్ జోషిని కలుస్తా. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని కోరతాం. రాష్ట్రంలోని గోదాముల్లో, రైసు మిల్లుల్లో ధాన్యం నిండిపోయాయి. వాటిని తరలించేందుకు 300 రైళ్లు ఇవ్వాలని కోరతామని ఉత్తమ్ వెల్లడించారు.

# నిండుకుండల్లా తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులు

నిజామాబాద్, తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులైన సింగూరు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. దీనితో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 158 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 94,383 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 96,003 క్యూసెక్కులను బయటకు పంపుతున్నారు. 29.917 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 18.237 టీఎంసీల నీరు ఉంది. ఇక నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. 39 గేట్లను ఎత్తివేసి 4,10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 3,40,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. 1091 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి, ప్రస్తుతం 1083.30 అడుగుల వద్ద ఉంది. 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి, ప్రస్తుతం 54.623 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,50,244 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు 21 గేట్లను ఎత్తివేసి 1,51,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1401.22 అడుగుల వద్ద ఉంది. అలాగే, 17.802 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 12.736 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో ఇన్ ఎ÷–లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోని 26 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 5,86,379 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తాన్ని బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 585.50 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 44.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.



# పార్టీ ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు



లండన్, పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో కవిత ముఖాముఖి మాట్లాడారు. 20 ఏళ్లు భారత రాష్ట్ర సమితి కోసం కష్టపడ్డాను. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుంది. వారివల్ల కోట్లాది మంది బాధపడొద్దన్నదే నా తపన. పార్టీలో చీలికలు రావొద్దని ఎంత ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డాను. పార్టీలో చాలా అవమానాలు ఎదురయ్యాయి. నా ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సంకల్పమని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం జాగృతి పనిచేస్తుందన్నారు. అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడంపై స్పష్టమైన ఆలోచన ఉంది. తప్పనిసరిగా నాకు అవకాశం వస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉంది. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. నా వెనక ఏ జాతీయ పార్టీ లేదు.. జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ. అభివృద్ధి పథంలో సాగుతున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తోంది. భాజపా డీఎన్ఏ నాకు సరిపడదన్నారు. విషయం ప్రజల్లోకి వచ్చిన తర్వాత వాటిపై స్పందించకపోతే తప్పవుతుంది. అందుకే మాట్లాడాల్సి వచ్చింది. పార్టీ నన్ను వద్దనుకుంది కాబట్టే.. పార్టీ ఇచ్చిన పదవిని వద్దనుకున్నాను. నిర్ణీత నమూనాలో రాజీనామా చేశాను. ఛైర్మన్ ఎందుకు ఆమోదించడం లేదో తెలియదు. నేను ఈ పరిస్థితికి రావడానికి అవతలి వాళ్లే కారణం. కష్టమవుతుందని తెలిసినా.. కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటాను. జైలు జీవితం నాలో అనేక మార్పులు తీసుకొచ్చింది. సమూలంగా మార్చేసింది. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పని చేయాలని కవిత అన్నారు. ఇదిలావుంటే తెలంగాణ పూల సింగిడి బతుకమ్మ పండుగ ఎల్లలు దాటింది. తెలంగాణలోనే కాకుండా పలు దేశాల్లోనూ బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు తెలుగువారు. వివిధ పనిల నిమిత్తం విదేశాల్లో ఉంటున్నప్పటికీ మూలాలు మర్చిపోకుండా తెలంగాణ సంస్కృతి, వైభవాన్ని చాటుతూ కెనడా, అమెరికా, ఖతర్, యూఏఈ, యూకే వంటి దేశాల్లోని తెలుగు ప్రజలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది లండన్‌లో కన్నుల పండుగగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. లూటన్ సిటీలో ఉంటున్న తెలుగు ప్రజలు లూటన్ తెలుగు అసోసియేషన్ (ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతూ, పూలను పూజిస్తూ, గౌరమ్మను ఆరాధించారు ఆడబిడ్డలు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చినవారందరికీ అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఎంతో ఆనందభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

# కాశ్మీర్,లద్దాఖ్‌లకు కేంద్రం ద్రోహం



శ్రీనగర్,జమ్ముకాశ్మీర్, లడఖ్ రాష్ట్ర హోదాలపై ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేంద్రాన్ని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడంలో జాప్యం చేయడం ద్వారా అవిశ్వాసాన్ని పెంచడం ద్వారా జమ్ముకాశ్మీర్, లడఖ్ రెండింటికీ ద్రోహం చేసిందని అన్నారు. కేంద్రం తన సొంత రోడ్‌మ్యాప్‌ను అనుసరించడంలో విఫలమైందని, 'అసాధ్యమైన' హామీలతో రెండు రాష్ట్రాలను తప్పుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లడఖ్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చుతామని హామీ ఇచ్చిందని అన్నారు. అయితే అది అసాధ్యం అని అందరికీ తెలుసు. ఒకవైపు చైనాతో, మరోవైపు పాకిస్తాన్‌తో సరిహద్దులను కలిగి ఉన్న ప్రాంతానికి గణనీమైన రక్షణ అవసరమని అన్నారు. ఎన్నికల కోసం తప్పుడు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. లడఖ్ నేతల పట్ల, ముఖ్యంగా వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పట్ల కేంద్రం భిన్నమైన వైఖరి ప్రదర్శించడాన్ని కూడా విమర్శించారు. గతంలో ప్రధానిని పర్యావరణ యోధుడిగా కొనియాడారని, 2019లో కేంద్రపాలిత ప్రాంతం (యుటి) హోదా కల్పించి, అక్కడి ప్రజల కలలను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపినపుడు ఎవరూ తప్పుపట్టలేదని అన్నారు. అటువంటి పెద్దమనిషికి అకస్మాత్తుగా ఈరోజు పాకిస్తాన్‌తో సంబంధాన్ని గుర్తించామని చెప్పారని ఇప్పుటికిప్పుడు గుర్తించారని కేంద్రాన్ని నిలదీశారు. మొదట డీలిమిటేషన్, తర్వాత ఎన్నికలు, చివరకు రాష్ట్రహోదా కల్పిస్తామని, ఇది మూడు దశల పక్రియ అని మొదట్లో చెప్పారని అన్నారు. డీలిమిటేషన్, ఎన్నికలు రెండూ కూడా పూర్తయ్యాయని, కానీ రాష్ట్ర హోదా హామీ ఎందుకు నిలిచిపోయిందని ప్రశ్నించారు.

# మాజీ ప్రధానిపై ప్రయాణ ఆంక్షలు

ఖాట్మాండు, నేపాల్ మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలిపై నేపాల్ ప్రభుత్వం ప్రయాణ ఆంక్షలు విధించింది. ఓలితో పాటు మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్, జాతీయ భద్రతా సంస్థ మాజీ హెడ్ హుతారాజ్ థాపా మరియు మరో ఇద్దరు సీనియర్ అధికారులపై కూడా ప్రయాణ నిషేధం విధించినట్లు అంతర్గత మంత్రి సోమవారం తెలిపారు. హింసాత్మక ఘటనలపై తాత్కాలిక ప్రధాని సుశీల్ కర్కి నియమించిన విచారణ కమిషన్ ఆదివారం ఈ పరిమితులను సిఫారసు చేసింది. అయితే నిషేధం ఇప్పటికే అమలులో ఉందని సోమవారం హోంమంత్రి ఓప్రకాష్ ఆర్యల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఐదుగురు వ్యక్తులు నేపాల్ వీడాలంటే వారు అనుమతి తీసుకోవాలని, ఏ సమయంలోనైనా విచారణకు హాజరు కావాల్సిందేనని కమిషన్ సభ్యుడు బిగ్యన్ రాజ్ శర్మ తెలిపారు. ఆటోమొబైల్, హోటల్ మరియు రిటైల్ ఇండిస్టీస్ సహా ప్రైవేట్ రంగానికి 600 మిలియన్ డాలర్ల నష్టం ఏర్పడినట్లు నేపాల్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్టీ (ఎఫ్ఎన్‌సిసిఐ) తెలిపింది. సోషల్‌మీడియా ఖాతాలపై విధించిన నిషేధం, ఆర్థిక సంక్షోభం, అవినీతికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 8న జెన్‌జెడ్ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో రెండు రోజుల్లో సుమారు 73మంది మరణించారు. పార్లమెంట్, ప్రభుత్వ భవనాలు దగ్ధమయ్యాయి. దీంతో నేపాల్ ప్రధాని కె.పి. శర్మఓలి రాజీనామా చేశారు.



# నకిలీ మందులకు చెక్!

ఏలూరు,ప్రజారోగ్యానికి చేటుగా గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్రం సరిహద్దులు దాటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నకిలీ మందులు విచ్చలవిడిగా చెలామణి అవుతున్నాయి. కొన్ని ఫార్మా కంపెనీలు అసలుకు నకిలీ ఏమిటో గుర్తుపట్టని విధంగా మందులను తయారు చేసి గంపగుత్తగా తమ బ్రాండ్లను వదులుతున్నాయి. ఈ గుట్టును తేల్చేందుకు కేంద్రప్రభుత్వం తాజాగా మందులపైన క్యూఆర్ కోడ్ ముద్రణ తప్పనిసరి చేసింది. నకిలీ మందుల అమ్మకాలు అరికట్టేందుకు ఇప్పుడున్న ట్రాక్ అండ్ ట్రేస్ విధా నంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మందుల వివరా లు ఇట్టే తెలిసిపోతాయి. ప్రతీ 100 మంది లో 60 మంది రోజువారీగా ఏదొక రూపంలో ఔషధాలను వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 250 హెూల్ సేల్, 1500 వరకు రిటైలర్లు దుకాణాలున్నాయి. 50కు పైగా ఆయుర్వేద మందుల దుకా ణాలున్నా యి. వీటి పరిధిలో రూ.150 కోట్ల మేర వ్యాపారం సాగుతుంటుంది.కరోనా తర్వాత దేశ వ్యాప్తంగా కేంద్రం క్యూఆర్ కోడ్ అమలుకు 2022 నవంబరులో శ్రీకారం చుట్టింది. అయితే కొంతకాలం గడువు ఇవ్వాలని ఫార్మా రంగం ప్రముఖులు కోర డం తో కొంత కాలం వాయిదా ప డగా, ఇటీవల క్యూఆర్ కోడ్ విధిగా అమలు చేయాలని ఆ దేశాలందాయి. ఫోన్‌లో స్కాన్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మందులపై ఉన్న పేర్లు, ముగింపు తేదీ లు, అసలుదా? నకిలీదా అ న్నది తేలిపోతుంది. యూనిక్ ప్రొడక్టు ఐడెంటిఫికేషన్ కోడ్, మందు జనరిక్ పేరు, బ్రాండు పేరు, లైసెన్సు నెంబరు కన్పిస్తాయి. ఒకవేళ ఔషధ ప్యాకింగ్‌పై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ లేకపోయినా వాటిని స్కాన్ చేస్తే వివరాలు కని పించకపోయినా అవి నకిలివీగా గుర్తించాలని డ్రగ్ కంట్రోల్ అథారిటి అధికారులు చెబుతున్నా రు.

**దాడులు పెంచిన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు**



క్యూఆర్ కోడ్ ముద్రణ ఫార్మా కంపెనీలు తప్పని సరి చేయడంతో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మం దుల దుకాణాలపై దాడులు, తనిఖీలను ముమ్మరం చేశారు. క్యూ ఆర్ కోడ్ అమలు చేయకపోయినా, నకిలీ మందులు అమ్ముతున్నట్లు తేలినా, దీనిపై ఆయా షాపుల లైసెన్సులు రద్దు చేయడం, ఫైన్‌లు విధించడం చేస్తున్నామని ఏలూర డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఎం.విక్రమ్ తెలిపారు. క్యూఆర్ కోడ్ అనేది అమ్మేవారికి, కొనేవారికి ఉపయుక్తమేనని, తొలి విడతగా 300 రకాల పైనే క్యూఆర్ కోడ్ విధిగా ఉంచాలన్న ప్రభుత్వ ఆదేశాలతో తాము మరింత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

**క్యూఆర్ కోడ్‌తో ఉపయోగమే..**

మందులకు క్యూ ఆర్ కోడ్ అమలు చేయడం మాకు ఉపయోగమే. ఎక్కడకక్కడ నకిలీలను అధిగమించడానికి ఆస్కారం ఉండనుంది. టాబ్లెట్ స్ట్రిప్‌లపై క్యూ ఆర్ కోడ్ నమోదు ఇంకా పూర్తిగా జరగలేదు.

# గన్నవరంలో ఉడాన్ యాత్రీ కేఫే

విజయవాడ, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రీ కెఫేను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఉడాన్ యాత్రీ కెఫేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కెఫేలో కాఫీని ఆయనే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ప్రయాణికుల అభిప్రాయాలను కేంద్ర మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఇలా కాఫీని అందుకోవడం ఆనందంగా ఉందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమ్మ పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విమానాశ్రయం ఆవరణలో మొక్కను నాటారు.అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమానాశ్రయ అధికారులు, ప్రయాణికులతో కలిసి ఇంత పెద్ద కార్యక్రమం చేయడం తనకు సంతోషంగా ఉందన్నారు. 10 ఏళ్ల క్రితం దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 160కి చేరిందని చెప్పారు. ఇన్ని విమానాశ్రయాలు ఉండడం వల్ల.. చిన్న పట్టణాలకు కూడా ఎయిర్ కనెక్టివిటీ ఇవ్వగలిగామని పేర్కొన్నారు. పట్టణాలకు సైతం ఎయిర్ కనెక్టివిటీ ఇవ్వడం వల్ల సామాన్యులు సైతం విమానాల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇక విమానంలో ప్రయాణిస్తున్న సామాన్య ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ సైతం తాము తీసుకున్నామని వివరించారు. విమానాశ్రయాల్లో తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఈ సందర్భంగా తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తొలిసారి ఉడాన్ యాత్రీ కెఫేను ముంబై

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com